క్లుప్తంగా

అయ్యప్ప మాల ధరించిన భక్తులు



దేవాలయంలో దీక్ష చేపట్టిన అయ్యప్పస్వాములు

కుల్కచర్ల: మండల పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు అయ్యప్ప స్వామి మాల ధరించారు. కుల్కచర్ల అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో పాలమూరు ఈశ్వర్ గురు స్వామి భక్తులకు మాలధారణ చేశారు. ఏటా ఈ ప్రాంతంలో అనేక మంది భక్తులు మాల ధరించి 41 రోజుల పాటు దీక్ష చేస్తారు. కార్యక్రమంలో గురుస్వాములు ఈశ్వరయ్య, రాజయ్య, రాములుగౌడ్, అంజిగౌడ్, శ్రీశైలం, శివకుమార్‌గౌడ్, శ్రీనివాస్, బాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్: పట్టణంలోని కార్గిల్ కాలనీలో లైన్ షిఫ్టింగ్ పనులు చేస్తున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ మహిపాల్ తెలిపారు. కొడంగల్ టౌన్, పర్సాపూర్, కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, పాత కొడంగల్, పలుగురాళ్ల తండా, మిషన్ భగీరథ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బొడ్రాయికి మహిళల జలాభిషేకం

దౌల్తాబాద్: మండల కేంద్రంలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా కొనసాగింది. మూడు రోజులుగా వీరాంజనేయస్వామి ఆలయం వద్ద బొడ్రాయి ప్రతిష్ఠాపనకు పురోహితులతో ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు బొడ్రాయిని ప్రతిష్ఠించారు. అనంతరం మధ్యాహ్నం మహిళలు బొడ్రాయికి జలాభిషేకాలు నిర్వహించారు.

తాగు నీటికి ఇక్కట్లు

హస్నాబాద్‌లో రెండు రోజులుగా ఇబ్బందులు



ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. గత రెండు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి కొరతతో కొందరు స్నానాలు కూడా చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమైన పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణిని సంప్రదించగా.. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే పైపులైన్ పగిలిపోయిందని, ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తామని చెప్పుకొచ్చారు. కానీ అవసరం ఎక్కువగా ఉన్న కాలనీలో కాకుండా వేరే చోట్లకు నీటిని సరఫరా చేశారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పట్టించుకొని వెంటనే నీటిని సరఫరా చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేయాల్సి వస్తుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

పరిగి: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ పేర్కొన్నారు. పరిగి పట్టణ కేంద్రంలోని 4వ వార్డు న్యామత్‌నగర్‌లో రూ.5లక్షల మున్సిపల్ నిధులతో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడుతామన్నారు. పట్టణ ప్రజలకు ఎవరికీ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే పట్టణంలోని అన్ని కాలనీలో మొత్తం సీసీ రోడ్డు పనులను చేపడుతామన్నారు. జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిద్దేందుకు పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి సహకరించాలని సూచించారు. పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ రవీందర్ పాల్గొన్నారు.

సరిహద్దు దాటుతున్న 'రేషన్'

- ప్రతి నెలా 50 క్వింటాళ్లకు పైగా బియ్యం అక్రమ రవాణా
- లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేస్తున్న డీలర్లు
- రాత్రివేళ ఆటోల్లో గుట్టుగా తరలిస్తున్న మాఫియా



ఇటీవల ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

బషీరాబాద్: తెల్లరేషన్ కార్డు దారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు అంతర్రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. గ్రామాల్లో రేషన్ బియ్యం తినని వారి నుంచి డీలర్లు నగదు బదిలీ పద్ధతిన సేకరించి రహస్య ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. అనంతరం అక్రమార్కులకు కమీషన్‌తో విక్రయిస్తున్నారు. బషీరాబాద్ మండలంలో ప్రతి నెలా 50 క్వింటాళ్లకు పైగా బియ్యం పొరుగు రాష్ట్రం కర్ణాటకకు అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. అడ్డుకోవాల్సిన పోలీసు, పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో అంటకాగుతున్నారనే ఆరోపణలున్నాయి.

కిలోకి రూ.10 చొప్పున

కేంద్ర ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు దారులకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తోంది. అయితే మండలంలోని కొంత మంది డీలర్లు లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకొని వారికి కిలోకు రూ.10 చొప్పున నగదు బదిలీ చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి రూ.15 కిలో చొప్పున విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసిన సదరు వ్యక్తి ఆటోల ద్వారా ఇందర్‌చెడ్, నీళ్లపల్లి మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నాడు. కర్ణాటకలోని సరిహద్దు గ్రామాల్లో వరి పంట సాగు చేయకపోవడంతో తెలంగాణ నుంచి బియ్యానికి డిమాండ్ ఉంది. అక్కడ కిలో రూ.25 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

అక్రమార్కులతో చెట్టాపట్టాల్!

రేషన్ బియ్యం అక్రమ రవాణా సాఫీగా సాగడానికి అక్రమార్కులు పోలీసులను, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులను మచ్చిగా చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి నెలా వారికి మమూళ్లు ముట్టచెబుతున్నట్లు సమచారం. బషీరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి ఇదే పనిగా అధికారుల చుట్టూ తిరుగుతుంటారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మండలంలోని దామర్ చెడ్ గ్రామం నుంచి గురువారం రెండు ఆటోల ద్వారా 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం కర్ణాటకకు బయలు దేరాయి. లాడేపల్లి ఎల్లేష్, బషీరాబాద్‌కు చెందిన సర్ఫరాజ్ అనే ఇద్దరు వ్యక్తులు రేషన్ బియ్యం కర్ణాటకకు తరలిస్తుంటే అల్లాపూర్ సమీపంలో ఏఎస్‌ఐ నారాయణ పట్టుకున్నారు. అయితే సర్ఫరాజ్ ఆటోను మాత్రమే పట్టుకున్న పోలీసులు మరో ఆటోను వదిలేసినట్లు తెలిసింది. సర్ఫరాజ్ ఆటోలో 75 కిలోల బియ్యం మాత్రమే దొరికాయని, వాటిని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై అధికారులకు బియ్యాన్ని అప్పగించినట్లు ఎస్‌ఐ గఫార్ మీడియాకు తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం



రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. ఎవరైన సమాచారం అందిస్తే వెంటనే వెళ్లి వాహనాలను పట్టుకుంటున్నాం. తరలించే వారిపై కేసులు కూడా నమోదు చేస్తాం. అయితే జహీర్ అనే వ్యక్తి దగ్గర పోలీసు వాహనాలకు డీజిల్ తీసుకునేది వాస్తవమన్నారు. అతడు పోలీసులతో సన్నిహితంగా ఉన్నంతా మాత్రాన లబ్ధి పొందే అవసరం మాకు లేదు.

– గఫార్, ఎస్‌ఐ

డీలర్లను హెచ్చరించాం



రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దృష్టి సారించాం. అక్కడక్కడా బియ్యం అమ్ముకుంటున్నారని తమ దృష్టికి వచ్చింది. ఇటీవల డీలర్లతో సమావేశం పెట్టి హెచ్చరించాం. ఇక నుంచి రెగ్యులర్‌గా రేషన్ దుకాణాల్లో రిజిస్టర్‌లను పరిశీలిస్తాం. ఏ మాత్రం తేడా వచ్చిన డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తాం. మూడు నెలలు వరుసగా బియ్యం తీసుకోకుంటే లబ్ధిదారులకు బియ్యం కట్ చేస్తాం.

– వెంకటేశ్, తహసీల్దార్

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



బొంరాస్‌పేట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: రైతులకు సౌకర్యంగా ఉండేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వడిచర్ల, కొత్తూరు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మద్దతు ధరతోపాటు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు మేలు చేస్తున్నారని అన్నారు. రుణమాఫీతో రైతులకు ఊరటనిచ్చారని అన్నారు. కార్యక్రమంలో కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, మల్లేశ్, నర్సింలునాయుడు, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

దౌల్తాబాద్: మండల పరిధిలోని దేవర్‌ఫసల్‌వాద్‌లో శుక్రవారం సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వ హకులకు సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ నర్సింలు, నాయకులు వెంకట్రాములు, మంజులాల్, రాజు, పాండునాయక్, సిబ్బంది ఎల్‌రెడ్డి, వెంకటేశ్ ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

ఎంపీడీఓ మహేశ్‌బాబు



కేశిలమ్మతండా పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కేశిలమ్మతండా, గూడూర్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన ఆ తర్వాత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా? అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా వింటూ మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని చదువుపై శ్రద్ధ చూపుతూ ఉన్నతమైన స్థానాలను అధిగమించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నౌషిన్, సరితజ్యోతి, ఇందిరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యత లోపించి.. లక్ష్యం నీరుగారి

కూలేందుకు సిద్ధంగా కుదురుమల్ల శ్మశానవాటిక



పగుళ్లు ఏర్పడిన దిమ్మెలు

దుద్యాల్: గత ప్రభుత్వం హయాంలో ప్రతి గ్రామాన ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన శ్మశాన వాటికలు శిథిలావస్థకు చేరాయి. మండల పరిధిలోని కుదురుమల్లలో గతంలో రూ.10.5 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక నేటికి అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణం పూర్తయి ఐదేళ్లు గడవక ముందే గదులు, శవాన్ని కాల్చే దిమ్మెలకు పగుళ్లు ఏర్పడి కూలేందుకు సిద్ధంగా మారాయి. అత్యున్నత ప్రమాణాలతో నిర్మించామని నాటి అధికార యంత్రాంగం పేర్కొంది. కానీ అవేమి కుదురుమల్లలో పాటించడం లేదనే విషయం శ్మశాన వాటికను చూస్తే అర్థం అవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించినా నాసిరకం కారణంగా కూలేందుకు సిద్ధంగా మారిందని స్థానికంగా చర్చించుకుంటున్నారు. నాణ్యత లేకుండా నిర్మించిన ఈ శ్మశాన వాటికకు అధికారులు ఎలా నిధులు మంజూరు చేశారని గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



బీటలు వారిన శ్మశానవాటిక విశ్రాంతి గది



బొంరాస్‌పేట: టేకులగడ్డతండాలో ఇంటింటి సర్వే



మోమిన్‌పేట: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

కుటుంబాల గుర్తింపు పూర్తి

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణనలో భాగంగా మూడు రోజులుగా కుటుంబాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. గుర్తించిన కుటుంబం ఇంటికి స్టిక్కరు అతికించామన్నారు. శనివారం నుంచి కులగణన సర్వే ప్రారంభించనున్నామని తెలిపారు. ఎన్యుమరేటర్లు ఉదయం, సాయంత్రం పూట గుర్తించిన ప్రతి ఇంటిని సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈఈ ప్రణీత్‌కుమార్, కార్యదర్శి స్వప్న, ఎన్యుమరేటర్లు తదితరులు ఉన్నారు.

ముగిసిన స్టిక్కర్లు అంటించే కార్యక్రమం

దుద్యాల్: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కులగణన ఇంటింటి సర్వేలో భాగంగా గత మూడు రోజులుగా ఎన్యుమరేటర్లు ఇంటికి స్టిక్కర్లు వేసే కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా దుద్యాల్ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఎన్యుమరేటర్లతో కలిసి గ్రామంలో ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా గ్రామంలో అన్ని ఇళ్లను గుర్తించి పత్రాన్ని అంటించామన్నారు. శనివారం నుంచి ప్రతి కుటుంబ వివరాలను నమోదు చేస్తామని తెలిపారు.

సర్వేకు ప్రజలంతా సహకరించాలి

దోమ: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గూడూర్, దొంగఎన్కేపల్లి, దోర్నాల్‌పల్లి, గొడుగోనిపల్లి, గోన్యనాయక్‌తండా, కేశిలమ్మతండా, మైలారం గ్రామాలలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సమగ్రంగా తీసుకోవాలన్నారు. మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 11,659 ఇళ్లు ఉన్నాయని, వాటిని 94 మంది ఎన్యుమరేటర్లు సర్వేను చేపడుతున్నారని తెలిపారు.

ఇంటింటికీ కులగణన సర్వే

బొంరాస్‌పేట: ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన సోషల్ ఎకనామిక్ కులగణన సర్వే మండలంలోని గ్రామాలు, తండాల్లోని ఇంటింటికి కొనసాగుతోంది. మండల కేంద్రంలో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, సిబ్బంది, ఐకేపీ సిబ్బంది మొత్తం 135 మంది సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లతో సర్వేలో పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

దౌల్తాబాద్: పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మూడో రోజు స్టిక్కర్లను అతికించే పనులను పరిశీలించారు. సర్వే సమయంలో సందేహాలు వస్తే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.



పరిగి: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో కేక్ కట్ చేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ

అభిమానం ఉప్పొంగి.. వేడుకలు మిన్నంటి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శుక్రవారం భారీ ఎత్తున వేడుకలు నిర్వహించారు. సీఎం ప్రజాసంక్షేమం కోసం అవిరల కృషి చేస్తున్నారని నేతలు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఉదయం నుంచే ఆయా చోట్ల కేకులు కోసి సంబురాలు ప్రారంభించారు. చిన్నారులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దాతృత్వం కార్యక్రమాలు చేపట్టారు. సీఎం సొంత జిల్లా కావడంతో వేడుకలు మిన్నంటాయి.

– సాక్షి, నెట్‌వర్క్



మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న శ్రేణులు



బొంరాస్‌పేట: సంబరాల్లో నాయకులు



అనంతగిరి: క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మండల నేతలు



పెద్దేముల్: సీఎం జన్మదిన వేడుకల్లో నేతలు



బంట్వారం: బార్వాద్‌లో..



కొడంగల్: చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న కార్మికులు



కొడంగల్ రూరల్: కొడంగల్‌లోని సీఎం నివాసంలో కార్యకర్తల సంబురాలు



యాలాల: పగిడియాలలో బాణసంచా కాల్చుతున్న గ్రామస్తులు



ధారూరు: కేజీబీవీ విద్యార్థినులతో కేక్ కట్ చేయిస్తున్న రఘువీరారెడ్డి



మోమిన్‌పేట: కేజీబీవీలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మర్పల్లి: మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో నూతనంగా బీరప్ప ఆలయం నిర్మించేందుకు గ్రామస్తులు శుక్రవారం వేదపండితుల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు సర్వోత్తమ శర్మ పెద్ద గొల్ల రాములు దంపతులతో కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాల బారిన పడొద్దు

నవాబుపేట: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని నవాబుపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల అందజేత

బషీరాబాద్: పారిశుద్ధ్య కార్మికులకు ఓ యువకుడు నూతన వస్త్రాలు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన రఘుసూత్రవే శుక్రవారం బషీరాబాద్ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న 12 మందికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యువకుడు మాట్లాడుతూ.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికులకు నూతన వస్త్రాలు అందజేయడం తన బాధ్యతగా గుర్తించానన్నారు. మూడేళ్లుగా అందజేస్తున్నాని చెప్పారు. కార్యక్రమంలో ప్రశాంత్, దీపక్, బాలుసూత్రవే, యాగనందు తదితరులుపాల్గొన్నారు.